ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.12.12.24 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు పాఠశాలల్లోనే పునాది పడాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.
2. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తోన్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ రెండో రోజు కొనసాగుతోంది.
3. రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రతతో పలు జిల్లాల్లో గడిచిన 24 గంటల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యా .
4. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని శాసన మండలి సభ్యురాలు కవిత డిమాండ్ చేశారు.

-------------------------------

**ములుగు వైజ్ఞానిక ప్రదర్శన**

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దానికి పాఠశాలల్లోనే గట్టి పునాది వేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను సాంఘిక సంక్షేమ

గురుకులు పాఠశాలలో మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయని అన్నారు. నూతన ఆవిష్కరణలు చేసే విధంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. పరిశోధన, నేర్చుకోవాలనే తత్వం అలవరుచుకున్నప్పుడే విద్యార్థుల్లో మేధో వికాసం పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు.

**DESK**

-------------------------------

**స్మార్ట్ ఇండియా హ్యాకథాన్**

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి జాతీయ ప్రాధాన్యం ఉన్న రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలను సాంకేతికంగా ఆవిష్కరించేందుకు నిర్వహిస్తోన్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫైనల్ రౌండ్ పోటీలు రెండో రోజు కొనసాగుతున్నాయి. దేశ వ్యాప్తంగా 51 కేంద్రాల్లో ఈ పోటీలు జరుగుతుండగా తెలంగాణాలో హైదారాబాద్ ఐఐటీ, శంషాబాద్ లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఈ హ్యాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 400 మంది విద్యార్థులు 57 బృందాలుగా పోటీ పడుతున్నారు. వ్యవసాయం, సముద్ర విజ్ఞానం సంబంధిత అనుబంధ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలకు విద్యార్థులు సలభంగా అనుసరించదగిన పరిష్కారాలను ఆవిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లో తమ అనుభవాలను ఆకాశవాణితో పంచుకున్నారు.

---------Sound Bytes-----------

**MSL/PTC/SR**

---------------------------

**అవిశ్వాసం**

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంఖర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ప్రతిపక్షాల తీరును తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుబాష్ విమర్శించారు. ఈ చర్యను దురదృష్టకరంగా అభివర్ణించిన ఆయన పార్లమెంటు లాంటి రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచేలా రాజకీయాలు దిగజారకూడదని అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే రాజ్యసభ చైర్మన్ పై ఆరోపణలు చేయడం అసమంజసమని, నిరాధారమని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ ను ప్రభుత్వ ప్రతినిధి అని ఖర్గే ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారని సుభాష్ ఆరోపించారు.

**PN**

-----------------------

**ఫేసియల్ రికగ్నిషస్ హాజరు**

హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు నుంచి ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ తో హాజరు నమోదు చేస్తున్నారు. సచివాలయంలో అన్ని ప్రవేశ ద్వారాల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేసి 60కి పైగా యంత్రాల ద్వారా అన్ని శాఖల ఉద్యోగులు హాజరు నమోదు చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగులు, రెగ్యులర్ సెక్రటేరియట్ అధికారులు, ఉద్యోగులు అందరికీ ఈ విధానాన్ని వర్తింపచేశారు.

**DESK**

---------------------------

**ఇందిరమ్మ ఇళ్లు**

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జనగామ జిల్లా వ్యాప్తంగా 43 వేల 194 మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు రూపొందించిన యాప్ ద్వారా పల్లెల్లో, మున్సిపల్ పట్టణాల్లో వివరాలు సేకరించే ప్రక్రియను జిల్లా యంత్రాంగం ఈ రోజు ప్రారంభించింది. ఈనెల 6 నుంచే జిల్లాలో పరిశీలన ప్రారంభం కాగా గ్రామ కార్యదర్శుల సంఘం సమ్మెకు దిగడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఎంపీడీవోల నుంచి లిఖితపూర్వక ఆదేశాలు తీసుకొని ఈ ప్రక్రియలో పాల్గొనాలని గ్రామ కార్యదర్శులకు సూచించడంతో ఈరోజు నుంచి సర్వే ప్రారంభించారు.

**పీటీసీ జనగామ**

----------------------------

**ఉష్ణోగ్రత**

రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. పలు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యు మండలంలో అత్యల్పంగా 7.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, నిర్మల్ జిల్లా పెంబిలో 8.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా నల్లవల్లిలో 9.7 డిగ్రీల, కనిష్ట ఉష్ణోగ్రతలు

నమోదయ్యాయి. మంచిర్యాల జిల్లా తపాలాపూర్ లో 10.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**పీటీసీ, సంగారెడ్డి, నిర్మల్, ఆసిఫాబాద్**

----------------------

**బయ్యారం ఉక్కు పరిశ్రమ**

బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని BRS శాసన మండలి సభ్యులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు, తెలంగాంణ హక్కు అని, ఈ పరిశ్రమ ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆమె అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విభజన చట్టంలో ఉందన్న కవిత, ఆ పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని పార్లమెంటులో రాష్ట్రానికే చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమని అన్నారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు.

**DESK**

-----------------------------

**మంత్రి తుమ్మల**

ఖమ్మం పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈరోజు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఆయన సమావేశం

నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం పట్టణ రూపురేఖలు మార్చే విధంగా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. పట్టణంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్యను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మున్నేరుకు వరదలు సంభవించినప్పుడు నష్టాన్ని అరికట్టేందుకు సరైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.

**పీటీసీ ఖమ్మం**

---------------------

**సైబర్ మోసం**

హైదరాబాద్ కు చెందిన క వ్యక్తి తన ఖాతా నుంచి కోటి 90 లక్షల రూపాయలు డెబిట్ అయినట్లు 1930 కాల్ సెంటర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తనకు ఎలాంటి అనుమానాస్పద సందేశం, లింక్ రాలేదని బాధితుడు తెలిపారు. ఫిర్యాదును నమోదు చేసిన సైబర్ క్రైం బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ మొత్తంలో వివిధ బ్యాంకుల్లో క్రెడిట్ అయిందని గుర్తించిన బృందం సంబంధిత బ్యాంకుల వద్ద డెబిట్ అయిన మొత్తంలో 75 లక్షల రూపాయలకు పైగా లావాదేవీని అడ్డుకున్నారు. మిగిలిన సొమ్ము కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

**PN**

--------------------------

**లోక్ అదాలత్**

నేషనల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో వచ్చే శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కింద ప్రీ-లిటిగేషన్, పెండింగ్ కేసులతో సహా అనేక రకాల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను పరిష్కారించుకోవచ్చు. లోక్ అదాలత్ లో ఎలాంటి ఖర్చులు లేదా రుసుము లేకుండా, సేవలను ఉచితంగా పొందవచ్చని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ తెలియజేసింది. ఈ అవకాశం జిల్లాల్లో కూడా అందుబాచులో ఉంటుంది.

**పీటీసీ**

--------------------------

**ధర్నా**

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం మోతే మండలం రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న NMK బయో ఫ్యూయల్స్ కంపెనీ నిర్మాణాన్ని ఆపేయాలని, అనుమతులను రద్దు చేయాలని కోరుతూ వామపక్ష పార్టీలు ధర్నా నిర్వహించాయి. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే కంపెనీ నిర్మాణం చేపడుతున్నారని వారు ఆరోపించారు. కంపెనీ నిర్మాణం జరిగితే రైతులకు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.

**సూర్యాపేట, పీటీసీ**

--------------------------------

**నాణ్యమైన భోజనం**

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా  కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్  తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆహారం తయారు చేయడంలో నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

**పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా**

----------------------------